క్లుప్తంగా...

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూకేజీ పూర్తి చేసిన చిన్నారులకు ప్లే స్కూలు, అకాడమిక్ హై స్కూల్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నీరజ్ కక్కర్ సర్టిఫికెట్లు, మెమోంట్‌లను అందజేసి మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రరేఖ, హుమేర, విశాలాక్షి పాల్గొన్నారు.

పనుల పరిశీలన

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో కొనసాగుతున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, స్విమ్మింగ్ పూల్ పనులను ఆదివారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వచ్చే మూడు నెలల్లో ఈ రెండింటిని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆమెవెంట మోతే శోభన్‌రెడ్డి, బండెల స్వామి, వంజరి వెంకటేష్, గిరి ఉన్నారు.

హక్కుల సాధనకు కృషి

అడ్డగుట్ట: ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఉపాధ్యక్షుడిగా బండ శ్యామ్ బాబు నియమితులయ్యారు. కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఫౌండర్, చైర్మన్ సురేష్ కుమార్ చేతుల మీదుగా ఆదివారం ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. హక్కుల సాధనకై నిరంతరం కృషి చేస్తానని ప్రజలకు వారి హక్కులపై అవగాహన కల్పించి, అవినీతి నిర్మూలనకు తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా బండశ్యామ్ బాబు పేర్కొన్నారు.

సీపీజీఈటీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీజీఈటీ-2023) నోటిఫికేషన్ విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఓయూతో పాటు ఇతర వర్సిటీలలో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉన్నత విద్యామండలితో కలిసి ఓయూ సీపీజీఈటీ-2023 నిర్వహిస్తోంది. డిగ్రీ తర్వాత చదివే ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు లాసెట్, ఎంసెట్, ఎడ్‌సెట్, ఐసెట్ తదితర అన్ని సెట్లకు నోటిఫికేషన్లు వెలువడి దరఖాస్తు తేదీలు సైతం సమీపిస్తున్న పీజీ కోర్సుల నోటిఫికేషన్ పై మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వెంటనే సీపీజీఈటీ-2023 నోటిఫికేషన్ విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

అడ్డగుట్టలో ఇంటింటికీ టీడీపీ



ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు

అడ్డగుట్ట: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమాభివృద్ధి పాలన ప్రజలు ఎన్నటికీ మరువలేరని ఆ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఆదివారం డివిజన్ అధ్యక్షుడు కాత విజయ్ కుమార్ నేతృత్వంలో తుకారాంగేట్‌లోని పలు బస్తీలలో టీడీపీ నాయకులు పర్యటించారు. వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో టీడీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, గణేష్, నర్సింహ, రమేష్, నవీన్, లక్ష్మీ ప్రసన్న, తిరుమలేష్, రామస్వామి, విజయ్ కుమార్, ప్రవీణ్, వినోద్, జీ.వి. కృష్ణ పాల్గొన్నారు.

కారులో వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి దాడి

అమీర్‌పేట: కారులో వెళ్తున్న ఓ వ్యక్తిని అడ్డగించి దాడికి పాల్పడిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫతేనగర్ పైప్‌లైన్ రోడ్డుకు చెందిన మహ్మద్ మిస్కిన్ ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 21న రాత్రి 11.45లకు తన కారులో బల్కంపేటకు వెళ్తుండగా బల్కంపేట శ్మశానవాటిక వద్ద ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి అడ్డగించారు. హారన్ కొట్టి వాహనం తీయాలని చెప్పినా వినిపించుకోలేదు. కారులో నుంచి కిందకు దిగుతుండగా అతడిపై దాడికి పాల్పడ్డారు. మిస్కిన్ తన సోదరుడికి ఫోన్ చేసేందుకు ప్రయత్నించగా ఫోన్ లాక్కోవడంతో పాటు డాష్ బోర్డులో పెట్టిన రూ.2 వేల నగదును తీసుకుని పారిపోయారు. గాయాలైన అతడు కుటుంబ సభ్యుల సాయంతో ఆస్పత్రిలో చేరాడు. అతడి మెడలోని బంగారు గొలుసు సైతం చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బోర్డు పరిధిలో తుగ్లక్ పాలన

మర్రి రాజశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పిచ్చి తుగ్లక్ నామినేటెడ్ సభ్యుడిగా ఉండడంతో తుగ్లక్ పాలన నడుస్తోందని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారంలో ఆదివారం బోర్డు మాజీ సభ్యుడు జే. లోకనాథం ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన సాయన్న కుమార్తెలు నివేదిత, లాస్యనందితతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ నాయకుల తుగ్లక్ పాలనలో భాగంగా కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీ విలీనం చేస్తున్నామని చెప్పి కొన్ని రోజులకే బోర్డు ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసి నెల రోజుల తర్వాత ఎన్నికలు రద్దు చేస్తూ గెజిట్ విడుదల చేశారని ఎద్దేవా చేశారు. బోర్డు నిబంధనలకు విరుద్ధంగా నామినేటెడ్ సభ్యుడు కోట్లాది రూపాయలను దండుకుని గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ పనులకు అనుమతులిప్పించారని ఆరోపించారు. రాష్ట్ర అధ్యక్షుడికి సైతం ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు.

మాకూ అండగా ఉండండి..

కంటోన్మెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, తమ నాన్న సాయన్న కంటోన్మెంట్ ప్రజలకు ఎంతగానో సేవా చేశారని ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు అండగా ఉంటామని ఏ విధంగా నాన్నకు అండగా ఉన్నారో తమ పట్ల అభిమానం చూపించాలని లాస్య నందిత కోరారు. బొల్లారంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. లోక్‌నాథ్ మాట్లాడుతూ.. బొల్లారంలో పలు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, తాగునీటి పైపులైను పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు సాయన్న నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, నళిని కిరణ్, మార్కెట్ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ ఖదీరవన్, టీఎన్. శ్రీనివాస్, ముప్పిడి మధుకర్, ప్రభుగుప్తా, నాగినేని సరిత పాల్గొన్నారు.

ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగస్వాములవుదాం



బేబీ కిట్లను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగస్వాములుగా నిలవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హెల్తీ బేబీ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోనే ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే అన్ని రకాల పథకాలకు సంబంధించి బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తోందని ఇదే క్రమంలో ఆహార భద్రతా కార్డుల ద్వారా ప్రతి ఒక్కరికీ బలవర్ధకమైన బియ్యాన్ని అందించే దిశగా కేంద్రం కృషి చేస్తోందన్నారు. చిన్నారులతో కలిసి వచ్చిన మాతృమూర్తులకు బేబీ కిట్లతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ, రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైలంగౌడ, సంతోష్‌కుమార్, పెద్ది రవీందర్, దయానంద్, క్రాంతికుమార్, ఆకుల మహేష్, నర్సింగరావు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

బౌద్ధనగర్: శక్తి కేంద్రాలను బలపరుస్తూ ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. శనివారం రాత్రి బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లలో ఏర్పాటు చేసిన శక్తికేంద్రం సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి అవినీతిమయంలో కూరుకుపోయిందని ఆరోపించారు. వచ్చేనెల నగరానికి ప్రధాని రానున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి, బండ కార్తిక రెడ్డి, శ్యామ్ సుందర్ గౌడ్, హరి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. భగత్‌సింగ్ సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఆదివారం సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రాంగణంలో టీపీఆర్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తలసీమియా బాధితుల కోసం నాలుగు సంవత్సరాలుగా టీ.రాజేశ్వర్‌గౌడ్ నేతృత్వంలో టీపీఆర్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు మోతే శోభన్‌రెడ్డి, నాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, జీ.చంద్రశేఖర్, తోబుల విష్ణు, మల్లారి అనిల్, ధరమ్‌రాజ్‌చౌదరి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు..

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. తార్నాక డివిజన్‌లోని పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఆదివారం ఆయన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. సంక్షేమ పథకాల కోసం ఎవరికీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఎవరైనా అడిగితే సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

ఉద్యోగాల భర్తీపై ప్రతిపక్షాలు స్పందించాలి

చటారి దశరథ్

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ఆందోళనలు చేపట్టనున్నట్టు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ ఇంత వరకు కోటి ఉద్యోగాలను కూడా భర్తీ చేయాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ నిరుద్యోగుల సంఖ్యను పెంచుతుందన్నారు. ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల పై స్పందించాలని కోరారు. నిరుద్యోగుల పట్ల బాధ్యత ఉంటే రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీలో దీక్ష చేయాలన్నారు. టీఎస్‌పీఎస్సీలో లీకేజీ వ్యవహారం బయటపడగానే పరీక్షలను రద్దు చేసి జరిగిన సంఘటనపై పారదర్శకతతో విచారణ జరిపిస్తోందని పేర్కొన్నారు.

వదంతులు నమ్మొద్దు



పీస్ కమిటీ సభ్యులతో సమావేశమైన పోలీసులు

చిలకలగూడ: కులమతాలకతీతంగా సోదరభావంతో మెలగాలని, అన్ని పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని చిలకలగూడ సీఐ నరేష్ కోరారు. ఠాణా ప్రాంగణంలో ఆదివారం ఆలయ, మసీదు కమిటీ నిర్వాహకులు, మతపెద్దలతో పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే వదంతులు, పుకార్లను నమ్మవద్దని, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులను ఫార్వర్డ్ చేయరాదని సూచించారు. రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పర్వదినాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, ర్యాలీ, శోభాయాత్ర, ఊరేగింపులకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, చిలకలగూడ ఏసీపీ శ్రీనివాసరావుల పర్యవేక్షణలో ఠాణా పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు తుల్జారామ్, కిషోర్, శ్వేత, ఆలయ, మసీదు, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఓయూ వార్షిక బడ్జెట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వార్షిక బడ్జెట్‌ను నేడు ప్రవేశ పెట్టనున్నారు. యూనివర్సిటీ పాలన భవనంలోని సెనెట్‌హాల్లో ఉదయం 10.30లకు జరిగే సమావేశంలో ఎంబీఏ ప్రొ.నాగేశ్వర్‌రావు 2023-24 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. సుమారు రూ.500 కోట్లకు పైగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం.

మూర్ఛ వ్యాధి ప్రాణాంతకం కాదు

అమీర్‌పేట: మూర్ఛ వ్యాధి ప్రాణాంతకం కాదని, వైద్యం ద్వారా పూర్తిగా నిర్మూలించవచ్చని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. మూర్ఛపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే పర్పుల్ దినం సందర్భంగా ఆదివారం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత స్క్రీనింగ్ క్యాంపు చేపట్టారు. న్యూరో సర్జన్ అనిరుధ్ కుమార్ పురోహిత్ పరీక్షలు చేయడంతో పాటు వ్యాధిపై అవగాహన కల్పించారు. దేశంలో మూర్ఛవ్యాధిపై మూఢనమ్మకాలు ప్రాచుర్యంలో ఉన్నాయని ఇవి అవగాహన లోపం వల్లే ఏర్పాడ్డాయన్నారు. మెదడులో ఏర్పడే లోపాలు, రుగ్మతల కారణంగా ఈ వ్యాధి అన్ని వయస్సుల్లో ఉన్న వారికి వచ్చే అవకాశముందని సకాలంలో వైద్యం అందిస్తే వ్యాధి పూర్తిగా తొలగిపోతుందన్నారు.

క్రైం కార్నర్..

పబ్‌లో అర్ధరాత్రి అశ్లీల నృత్యాలు

రాంగోపాల్‌పేట్: అర్ధరాత్రి వరకు అశ్లీల నృత్యాలు చేస్తున్న ఓ పబ్‌పై టాస్క్‌ఫోర్స్, మహంకాళి పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. రాణిగంజ్‌లోని గోల్డెన్ డీర్ పబ్‌లో శనివారం అర్ధరాత్రి తర్వాత కూడా కొనసాగుందని సమాచారం మేరకు ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ మహంకాళి పోలీసులు కలిసి దాడులు చేశారు. ఈ సందర్భంగా కొంత మంది యువతులు, యువకులు అశ్లీలంగా నృత్యాలు చేస్తుండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పబ్ యజమానులే కస్టమర్లను ఆకర్షించేందుకు యువతులను అక్కడ ఉంచి డ్యాన్సులు చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా 9 మంది యువతులు, 9 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు.

భార్యపై హత్యాయత్నం

అమీర్‌పేట: గొడవ పడకుండా మంచిగా ఉంటానని నమ్మించి ఇంటికి వచ్చి భార్యపై హత్యాయత్నం చేశాడో ప్రబుద్ధుడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బోరబండ సైట్-3లో ఆదివారం జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సైట్-3 లేబర్ అడ్డా సమీపంలో ఉండే సమిత (35)కు 2012లో విజయవాడ ముళ్లపాడుకు చెందిన నాగేశ్వర్ రావుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఏడాదిగా వేర్వేరుగా ఉంటున్నారు. ఇటీవల సమితతో మాట్లాడిన నాగేశ్వర్‌రావు నీతో గొడవ పడనని, ఇకపై మంచిగా ఉంటానని నమ్మించాడు. ఇంటికి వచ్చిన భార్య సమితతో మళ్లీ గొడవ పడ్డాడు. మాటామాట పెరగడంతో పిల్లలు చూస్తుండగానే కత్తి తీసుకుని సమితపై గొంతు కోసి, తలపై పొడిచాడు. సమిత గట్టిగా కేకలు వేయడంతో చుట్టూ పక్కన వారు వచ్చే సరికి నాగేశ్వర్‌రావు పారిపోయాడు. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ తూర్పుగేటు వద్ద సుమారు 40 వయస్సున్న వ్యక్తి స్పృహతప్పి పడిపోయి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బంది వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో..

లాలాపేట: గుర్తు తెలియని ఓ మృతదేహం లభ్యమైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కె రాజు, హోంగార్డు సుధాకర్ యాదవ్ తార్నాకలోని మెట్రో పిల్లర్ వద్ద దాదాపుగా 50 ఏళ్ల వయస్సున్న ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. వైట్ డాట్స్ షర్టు, బ్లాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

కేఎల్ఎన్ పార్కును సుందరంగా తీర్చిదిద్దుతాం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

అమీర్‌పేట: సనత్‌నగర్‌లోని కంజర్ల లక్ష్మినారాయణ పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పార్క్‌లో రూ.2.41 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ప్రతి రోజు వాకింగ్, యోగా, జిమ్ చేసేందుకు అనేక మంది వస్తుంటారని, వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే తరహాలో పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాత్‌వే ల నిర్మాణం, పార్క్‌కు రెండు వైపులా ఉన్న గేట్లు ఆర్చిలను అత్యంత సుందరంగా నిర్మిస్తున్నామని చెప్పారు. మోడరన్ టాయిలెట్స్, నూతనంగా లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వయోవృద్ధులను దృష్టిలో పెట్టుకుని మట్టితో కూడిన వాకింగ్ ట్రాక్ మెడిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని వాకర్స్ చేసిన విజ్ఞప్తికి స్పందించిన తలసాని అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తాను వచ్చిన తర్వాతే పార్క్‌తో పాటు రోడ్లు, డ్రైనేజీ, వాటర్‌లైన్ వంటి అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, పార్క్ అభివృద్ధి కమిటీ చైర్మన్ షాబాద్ శ్రీనివాస్ రావు, అధ్యక్షులు రమేష్‌గౌడ్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, డీసీ మోహన్‌రెడ్డి, అధికారులు భార్గవ్, రత్నాకర్, ఇందిర పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి చర్యలు

బన్సీలాల్‌పేట్: జీరా కంపౌండ్ ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తలసాని పేర్కొన్నారు. ఆదివారం ఆయన జీరా కంపౌండ్‌లో పర్యటిస్తూ మాట్లాడారు. ఎంతో కాలం నుంచి నిరాదరణకు గురైన జీరా పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎంతో కాలం నుంచి తాము ఇక్కడ జీవిస్తున్నా తమ ఇళ్ల క్రమబద్ధీకరణకు నోచుకోలేదని స్థానిక మహిళలు మంత్రి దృష్టికి తీసుకురాగా ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించి కొన్ని పరిపాలనపరమైన ఇబ్బందులు ఉన్నాయని వాటిని అధికమించి త్వరలో క్రమబద్ధీకరణకు ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణగౌడ్, అభిషేక్, వినయ్, నర్సింగ్‌రావు, విట్టల్, వెంకటేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని వినతి..

పద్మారావునగర్: పద్మారావునగర్ పార్కులోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించడానికి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్, సంఘం అధ్యక్షులు బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చక్రధర్ కలిసి మంత్రికి విన్నవించారు. పార్కులో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని వర్షాకాలం వచ్చిందంటే పార్కులో వాకింగ్ చేయడం భయంగా ఉంటుందన్నారు. స్పందించిన మంత్రి విద్యుత్ డీఈకి ఫోన్‌చేసి ట్రాన్స్‌ఫార్మర్ తరలింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కాంగ్రెస్‌లోకి ప్యారసాని రామ్‌కుమార్



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రామ్‌కుమార్

రసూల్‌పురా: బీఆర్ఎస్ కంటోన్మెంట్ సీనియర్ నాయకులు ప్యారసాని రామ్‌కుమార్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు కంటోన్మెంట్ నియోజకవర్గం తిరుమలగిరి లాల్‌బజార్ మహంకాళి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించిన రామ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరేందుకు భారీ ర్యాలీగా గాంధీభవన్‌కు తరలివెళ్లారు. అనంతరం రామ్‌కుమార్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని పార్టీలో చేరినట్లు తెలిపారు. తమ కుటుంబం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కుటుంబం అని తన తండ్రి ప్యారసాని గౌరిశంకర్ పీజేఆర్ శిష్యుడు, వైఎస్సార్‌కు విధేయుడన్నారు. కొన్ని కారణాల వల్ల టీఆర్ఎస్‌లో చేరినప్పటికీ ఆ పార్టీలో ఇమడలేక తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో నందికంటి శ్రీధర్, చాల కిరణ్‌కుమార్ రెడ్డి, రోహిణి రెడ్డి, అనిల్ యాదవ్, బద్దం బల్వంత్ రెడ్డి, ఎస్. శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, కే. శ్రీనివాస్, రవి, గోవీంద్ రెడ్డి, మహేందర్ రెడ్డి, నాగరాజు, రాము గౌడ్, దేవేందర్, మురళి పాల్గొన్నారు.

మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో బస్తీ నిద్ర



అంబేడ్కర్ హట్స్‌లో బస్తీ నిద్ర చేస్తున్న క్రిశాంక్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్‌లో రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ శనివారం రాత్రి బస్తీ నిద్రలో పాల్గొన్నారు. బస్తీవాసులతో సహపంక్తి భోజనం చేసి అనంతరం వారితో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంబేడ్కర్ హట్స్‌లో ప్రధానంగా మరుగుదొడ్ల సమస్య ఉందని రెండువేల మంది నివాసముంటుండగా కేవలం ఐదు మరుగుదొడ్లు ఉన్నాయని మహిళలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెప్పారు. అర్హత గల నలుగురికి పింఛన్ రావడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం క్రిశాంక్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌లో ఉచిత తాగునీటి పథకం అమలవుతోందన్నారు. నీటి వసతితో పాటు సీఎస్సార్ నిధులతో మరుగుదొడ్లు నిర్మిస్తామని కుదరని పక్షంలో సొంత నిధులతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో బస్తీనిద్ర కార్యక్రమం నిర్వహించి సమస్యలు తెలుసుకుంటామని క్రిశాంక్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అశోక్, వెంకట్, రాములు, సుందర్, గురువయ్య, సందీప్, అంజి, సాయికృష్ణ, రోశన్న, రగు, మోని, త్రివేద్, ఫహీం, సాయి కిరణ్, పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

అడ్డగుట్ట: ఇచ్చిన మాట నిలబెట్టుకుని పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్ సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలనే అనే డిమాండ్‌తో 18 రోజులుగా నిర్వహిస్తున్న మాదిగ సంగ్రామ యాత్రలో భాగంగా ఆదివారం అడ్డగుట్టలో నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు మల్లికార్జున్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 30న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముందు, మార్చి 31న కలెక్టరేట్ల ముందు మహా ధర్నాకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారన్నారు. అందులో భాగంగా మహాధర్నాను విజయవంతం చేయడానికి హైదరాబాద్‌లోని అన్ని మాదిగ బస్తీల్లో యాత్ర చేరే విధంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పారపు లక్ష్మణ్, గజ్జల రాజశేఖర్, సుజాత, ఉమ, ఒదమ్మ, భూలక్ష్మి, ఈశ్వరమ్మ, రాధ, యాదగిరి, తరుణ్, జగన్ పాల్గొన్నారు.

తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి



కంటి అద్దాలు అందజేస్తున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం ఎంతైనా అవసరమని శ్రీగణేశ్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీగణేశ్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాడ్‌బండ్ తవాయిపురాలో గతంలో వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి ఆదివారం కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత వారం నిర్వహించిన వైద్య శిబిరంలో భాగంగా పెద్ద సంఖ్యలో పరీక్షలు నిర్వహించామన్నారు. కళ్లద్దాలు అవసరమైన వారి వివరాలు నమోదు చేసుకుని ప్రత్యేకంగా కళ్లద్దాలు తయారు చేయించామన్నారు. ప్రజల్లో కంటి సమస్య తీవ్రంగా ఉందని సకాలంలో గుర్తించి తగిన చికిత్స చేయించుకోకపోతే పరిస్థితి విషమించే ప్రమాదముందన్నారు. ఈ నేపథ్యంలో నిరుపేదలు ప్రభుత్వం నిర్వహించే కంటి వెలుగుతో పాటు, వివిధ సంస్థలు నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.